క్లుప్తంగా

క్లాప్ మిత్రలకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న సర్పంచ్ సత్యవతి

తుని రూరల్: కేఓ.మల్లవరం పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేస్తున్న క్లాప్ మిత్రలకు సర్పంచ్ డొంక సత్యవతి దుస్తులను పంపిణీ చేశారు. మంగళవారం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో దుస్తులను సర్పంచ్ అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు డొంక వెంకట బెనర్జీ, కార్యదర్శులు జి.వీరబాబు, శివ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళకు ఆర్థిక సాయం



లక్ష్మికి నగదు అందిస్తున్న సర్పంచ్ కటకం శివ

తొండంగి: గోపాలపట్నంలో రెండు రోజుల క్రితం వరికుప్ప దగ్ధమై నష్టపోయిన మహిళకు జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత మంగళవారం రూ.5వేల ఆర్థిక సాయం చేశారు. గ్రామ శివారులో మహిళా రైతు పలివెల లక్ష్మికి చెందిన ఎకరన్నర వరి పంట కుప్పగా వేయగా అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోయింది. నష్టపోయిన లక్ష్మికి గ్రామ సర్పంచ్ కటకం శివ, ఎంపీటీసీ గునిమానికల ఏసుబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు యడ్ల వెంకటరమణ నగదు అందజేశారు.

లింగంపర్తిలో గో పూజలు

ఏలేశ్వరం: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని లింగంపర్తి గ్రామంలో మంగళవారం గో పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక వేత్త ఆలమూరి సుబ్బారావు ఆధ్వర్యంలో వంకాయలపాటి చిట్టిబాబు గోశాలలోని గోవులకు పూజలు చేశారు. కన్యకాపరమేశ్వరీ ఆలయ భజన సమాజం సభ్యులు సూర్యారావు, రత్నమాల, పూర కృష్ణ, శ్రీను, కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరే ప్రభుత్వ లక్ష్యం



కుళాయిలను పరిశీలిస్తున్న శివప్రసాద్

ఏలేశ్వరం: ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి శివప్రసాద్ అన్నారు. తూర్పులక్ష్మీపురం గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలను సోమవారం ఆయన పరిశీలించారు. ఎంపీటీసీ సభ్యుడు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి లేకుండా కుళాయిలను ఏర్పాటు చేస్తున్నారు. అనంతరం డ్రైన్ల పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

ఘనంగా నగర సంకీర్తన

ఏలేశ్వరం: ధనుర్మాసం పురస్కరించుకుని పట్టణంలో మంగళవారం తెలవారుజామున నగర సంకీర్తన నిర్వహించారు. పట్టణానికి చెందిన భజంతుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో సాయిబాబామెట్టపై బాబా ఆలయం, రామాలయాల మీదుగా పురవీధుల్లో భజన గీతాలు ఆలపిస్తూ భక్తులు నగర సంకీర్తన చేశారు. స్థానిక షిర్డినగర్‌లోని గాంధీజీ విగ్రహం సమీపంలో హనుమాన్ ఆలయం భజన బృందాల నేతృత్వంలో మహిళలు భక్తిగీతాలు ఆలపించారు.

నేడు ఫొటోగ్రాఫర్ల ప్రమాణ స్వీకారం

తుని: ఫొటో, వీడియో గ్రాఫర్ల జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారం బుధవారం సాయివేదికలో నిర్వహించనున్నట్టు గౌరవ అధ్యక్షుడు ఎండీ.ముక్తార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు పెండెం దొరబాబు, పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, బాబూరావు హాజరవుతున్నారన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

తుని: సీఐటీయూ 17వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి కోరారు. మంగళవారం సీఐటీయూ తుని కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్ ఒకటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సుబ్రహ్మణ్యంకు అందజేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు శేషుబాబ్జీ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలని వినతి

రౌతులపూడి: తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ మండల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు మంగళవారం ఆందోళన చేశారు. ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని తదితర పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు ఎల్.శివకుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ అసోసియేషన్ ప్రతినిధులు కె.రాజేశ్వరి, బి.రత్నకుమారి, బి.సత్యవేణి, మణి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- ఒంటిమామిడిలో గడప గడపకూ మన ప్రభుత్వం



ఒంటిమామిడిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తొండంగి: రాష్ట్రంలో అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మంగళవారం ఒంటిమామిడి గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ అరాచక పాలన నుంచి ఇబ్బందులు పడిన పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల కష్టలను తీర్చేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలతోపాటు ఇతర సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అర్హులందరికీ అన్ని పథకాలు అందుతాయన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటా పర్యటించి సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకుని తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, ఎంపీపీ అంగుళూరి అరుణ్‌కుమార్, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, పార్టీ సీనియర్ నాయకులు కొయ్యా మురళి, గాబు రాజు, ఎంపీడీఓ పసపులేటి సతీష్, ఈవోపీర్డీ ఎన్.సత్యప్రసాద్, సర్పంచ్ అంగుళూరి సుధాకర్, ఉపసర్పంచ్ సర్పంచ్ గోసల కిషోర్, వైఎస్సార్ సీపీ నాయకులు కింతాడ పాపారావు, పెదపూడి రమణ, పెనుమత్స నాని, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



ఒంటిమామిడి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

తొండంగి: సమాజంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు అన్నారు. ఒంటిమామిడిలో పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో వ్యసనాలకు బానిసలైన యువత చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.అనంతరం స్టేషన్ పరిసరాలను, నోటీస్ బోర్డు, సెల్, ఇతర పరిసరాలను, కేస్‌డైరీలను, ఇతర రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పోలీసుస్టేషన్‌కు సంబంధించిన స్థలాన్ని కూడా పరిశీలించారు. ఆయన వెంట కాకినాడ స్పెషల్ బ్రాంచి డీఎస్పీ ఎం. అంబికా ప్రసాద్, పెద్దాపురం ఇన్‌చార్జి డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, తుని రూరల్‌సీఐ ఏ.సన్యాసిరావు, తొండంగి ఎస్సై ఎస్.రవికుమార్, ఇతర పోలీసు సిబ్బంది ఉన్నారు.

పైపులైన్ పనులను పరిశీలించిన ఎస్పీ

పెరుమాళ్లపురం బీచ్‌లో నిర్మిస్తున్న కాకినాడ గేట్ వే పోర్ట్ లిమిటెడ్ ఫ్లొలైన్ పైపులైన్ పనులను జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు పరిశీలించారు. పైపులైన్ భద్రత తదితర అంశాలపై పోర్టు ప్రతినిధులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. అదేవిధంగా బుచ్చయ్యపేటలో గేట్‌వే నిర్మాణ పనుల్లో భద్రతకు సంబంధించి కూడా అధికారులకు సూచనలు చేశారు.

చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై అవగాహన

రౌతులపూడి: సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాల్లో ఎవరైనా కోడిపందాలు, గుండాట, పేకాట, వంటి చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలకు దురంగా ఉండేలా ప్రజలను చైతన్య వంతులను చేయాలని తహసీల్దారు ఎల్.శివకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అన్నవరం ఎస్.ఐ శోభన్‌కుమార్‌తో కలిసి మహిళా పోలీసులు, వీఆర్‌ఓలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీఆర్‌వోలు గిరి, బాబ్జి, మహిళా పోలీసులు మాధవి, రామలక్ష్మి, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

లోవ మహా మండపం పనులకు శ్రీకారం



పిల్లర్ వేస్తున్న దృశ్యం

తుని రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో మహా మండపం నిర్మాణానికి నాలుగు కాంక్రీట్ పిల్లర్ల పనులు చేపట్టారు. మంగళవారం దేవదాయశాఖ కాకినాడ డీఈ ఉదయ్ కుమార్ పర్యవేక్షణలో ఈ పనులు జరిగినట్టు కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. రూ.ఐదు కోట్లతో అమ్మవారి ప్రధాన గర్భాలయం, ఐదు అంతస్తుల మహా మండపాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ముందుగా మహా మండపం పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తయితే ఈ వారంలో ప్రధాన గర్భాలయంలో అమ్మవారి దర్శనాలు నిలిపి వేసి, బాలాలయంలో అమ్మవారిని దర్శించేందుకు భక్తులను అనుమతించనున్నారు. రూ.ఐదు కోట్లతో చేపట్టిన పనులు ఏప్రిల్ నెలాఖరుకి పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఈఓ తెలిపారు. ఏఈ వెంకటరమణ, వర్క్‌ఇన్‌స్పెక్టర్ జగదీష్ కుమార్ పాల్గొన్నారు.

పేదలందరికీ సొంతిళ్లు



ఇళ్ల పట్టాలు అందజేస్తున్న వెంకటేశ్వరరావు

ఏలేశ్వరం: పేదలందరికీ సొంతిళ్లు అందించడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని సొసైటీ అధ్యక్షుడు కొండపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. జె.అన్నవరంలో సోమవారం జగనన్న శాశ్వత గృహ హక్కు రిజిస్టర్ పట్టాలను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. వేంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి పేదవాడికి సొంతిళ్లు ఉండాలంటే లక్ష్యంతో సీఎం జగన్ రాష్ట్రంలో 30 లక్షల ఇళ్లను మంజూరు చేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 95 శాతం నెరవేర్చిన ఘనత సీఎంజగన్‌దేనన్నారు. సీఎం జగన్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. పార్టీనాయకులు కాలారి సత్తిబాబు, కార్యదర్శి సూర్యకుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సేకరణకు సర్వే



కొత్తపల్లిలో సర్వే చేస్తున్న సర్వే విభాగం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ కుమార్

తొండంగి: కోస్తా తీరప్రాంతంలో భారత్‌మాల ప్రాజెక్టు రహదారి నిర్మాణానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియలో భాగంగా ఎ.కొత్తపల్లిలో ల్యాండ్ సర్వే అధికారుల బృందం ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించారు. అన్నవరం జాతీయ రహదారి నుంచి తొండంగి, యు.కొత్తపల్లి మండలాల మీదుగా కాకినాడ వాకలపూడి వరకూ 45 మీటర్ల వెడల్పుతో రహదారి నిర్మాణానికి ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. దీనిలో భాగంగా జిల్లా సర్వే విభాగం కాకినాడ టాస్క్‌ఫోర్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఎం.ఎ.కుమార్, పెద్దాపురం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ పి.వి.ఎస్.కె ప్రసాద్ తదితరులతో కూడిన అధికారుల బృందం పర్యటించింది. ఎ.కొత్తపల్లిలో రహదారి భూసేకరణకు సంబంధించి మ్యాప్‌లను ఆధారంగా ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించారు. అన్నవరం, ఆరెంపూడి అన్నవరంతోపాటు తొండంగి మండలంలో ఏడు గ్రామాలు, యు.కొత్తపల్లి మండలంలో తొమ్మిది గ్రామాల మీదుగా రహదారి నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ జరుగుతుంది. భూసేకరణ పూర్తయితే రహదారి నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ నిరంజన్‌రావు, విలేజ్ సర్వేయర్లు ఎస్.ఎస్.ఆర్.విహారీ, చంటిబాబు, వీఆర్వో విజయ్ తదితరులు ఉన్నారు.

ఉపాధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం

ద్వామా పీడీ వెంకటలక్ష్మి

ప్రత్తిపాడు రూరల్: ఉపాధి పనుల నిర్వహణలో నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలని ద్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి స్పష్టం చేశారు. వాకపల్లిలో ఉపాధి హామీ పనుల్లో భాగంగా చేపట్టిన పుంత రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. మస్తర్లను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉపాధి పనులతో సౌకర్యాలు మెరుగుపడాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ ఏబీవీ నాయుడు, ద్వామా సీసీ ప్రసాద్, టీఏ భాను ప్రకాష్, ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



తునిలో పనులు ప్రారంభిస్తున్న చీఫ్ జనరల్ మేనేజరు నవీన్ చంద్ర ఝూ

తుని: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజరు నవీన్ చంద్రఝూ అన్నారు. మంగళవారం తుని బెల్లపువీధిలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి ఆధునీకరణ పనులను ప్రారంభించారు. జనరల్ మేనేజరు కృష్ణన్ శర్మ, డిప్యూటీ జనరల్ మేనేజరు సురేష్ ప్రభు, రీజనల్ మేనేజరు సురేష్‌బాబు, తుని బ్రాంచి మేనేజరు జె.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పించన్లు ఇవ్వాలంటూ ఆందోళన

కిర్లంపూడి: వేలంక గ్రామానికి చెందిన ఎలుబండి చెలయమ్మ, ఇంటి మహాలక్ష్మిలకు నూతనంగా మంజూరైన పించన్లు తక్షణం ఇవ్వాలంటూ స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జగ్గంపేట నియోజకవర్గం జనసేన కోఆర్డినేటర్ పాటంశెట్టి సూర్యచంద్ర మంగళవారం ఆందోళన చేపట్టారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- రాచపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం



రాచపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ప్రతిపాడు రూరల్: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనసాగిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం దాచేపల్లి సచివాలయం-1 పరిధిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను (బంకు శ్రీను) స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు సారిపల్లి గంగరాజు, ఒమ్మి రమణ, పెద్దిరెడ్డి ప్రసాద్, పెద్దిరెడ్డి నానిబాబులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత మూడున్నరేళ్లలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతి కుటుంబానికి వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే పర్వత దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల నేత రామిశెట్టి చినబాబు, పార్టీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, సర్పంచ్‌లు రొంగల నాగేశ్వరరావు, గొనగాల అప్పలరాజు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన



డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన నాయకులు

గోకవరం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక ఉన్న ముస్లిం కాలనీలో డ్రైనేజీ నిర్మాణానికి మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు శంకుస్థాపన చేశారు. స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆదేశాల మేరకు రూ.5 లక్షలతో నిర్మించే ఈ డ్రైనేజీకి సీనియర్ నాయకులు సుంకర వీరబాబు, పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్‌లు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రి సూరారెడ్డి, తోలేటి రాంప్రసాద్, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఎస్ఎస్ ఆలీషా, మదీనా, రాజేష్, కొలిపాకుల ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు మంత్రి ఆర్థిక సాయం



శృంగవృక్షంలో అగ్ని ప్రమాద స్థలాన్ని పరిశీలించిన మంత్రి దాడిశెట్టి రాజా

తొండంగి: శృంగవృక్షంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండిళ్లు కాలిపోవడడంతో నష్టపోయిన బాధితులను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టిరాజా పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించారు. గ్రామంలోని ఎస్సీపేటలో ద్రాక్షరపు నూకరాజు, అడ్డాల మరిడయ్యలకు చెందిన గుడిసెలు అగ్నిప్రమాదం సంభవించడంతో పూర్తిగా కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.నాలుగు లక్షల ఆస్తినష్టం ఉంటుందని రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. కాగా విషయం మంత్రి దాడిశెట్టి రాజాకు తెలియడంతో వెంటనే ప్రమాద స్థలికి చేరుకొని బాధితులను పరామర్శించి, తక్షణ సహాయంగా రూ.50వేలు అందించి, నిత్యావసర వస్తువులు అందజేశారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందిచడంతోపాటు నూతన గృహనిర్మాణానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



టోర్నీని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తొండంగి: శృంగవృక్షం జెడ్పీ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో మంగళవారం సంతోష్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన పుసర్ల సంతోష్ జ్ఞాపకార్థం టోర్నమెంట్‌ను నిర్వహించగా, వైఎస్సార్ సీపీ యువ నాయకుడు పప్పల వెంకట్, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ అడపా సురేష్ యువతతో కలిసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. జిల్లాలో పలు ప్రాంతాలకు చెందిన జట్లు ఈ టోర్నమెంట్‌లో 45 టీమ్‌లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. మొదటి మ్యాచ్‌లో పాడేరు జట్టుపై తొండంగి జట్టు విజయం సాధించింది. వారం రోజుల పాటు ఈ టోర్నమెంట్ జరగనుంది.విజేతలకు విన్నర్స్‌కు గ్రామానికి చెందిన మొగిలి మదన్‌మోహన్ రూ.20 వేలు, రన్నర్స్‌కు వైఎస్సార్ సీపీ యూత్‌నాయకుడు పప్పల వీవీఆర్.మూర్తి(వెంకట్) రూ.10వేలు, మరికొంత మంది కన్సోలేషన్ బహుమతులు అందించనున్నట్టు నిర్వాహకులు వివరించారు. ఈ సందర్భంగా సంతోష్‌కు స్నేహితులు, యువత శ్రద్ధాంజలి తెలిపారు.

మెగా వైద్య శిబిరం

ప్రత్తిపాడు: స్థానిక మునసబు గారి రామాలయం వద్ద మంగళవారం జనసేన ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈశిబిరాన్ని వరుపుల తమ్మయ్యబాబు ప్రారంభించారు. కాకినాడకు చెందిన వైద్యులు సుమారు 250 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. మహాసేన అధ్యక్షుడు సరిపల్లి రాజేష్, జిల్లా చిరంజీవి యూత్ అభిమాన సంఘం అధ్యక్షుడు మేడిశెట్టి సూర్యకిరణ్, జనసేన నాయకులు పాల్గొన్నారు. జనసేన నాయకుడు గోపిశెట్టి శ్రీను ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేట రామాలయం వద్ద మంగళవారం సాయంత్రం 30 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. జనసేన మండల కమిటి అధ్యక్షుడు రామకుర్తి కామేష్, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లోకి దూసుకుపోయిన లారీ

జగ్గంపేట: వెంగయమ్మపురంలో లారీ ఒక ఇంట్లోకి దూసుకుపోయింది. ఈ సంఘటనలో ఎటువంటి ప్రమాదం జరగలేదు. మంగళవారం జరిగిన ఈ సంఘటనపై స్థానికుల సమాచారం ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని కాలిమేల నుంచి పెద్దాపురం వెళుతున్న లారీ వెంగయమ్మపురం వద్దకు వచ్చేసరికి అప్పటికే అప్పాన తాతాబాబు ఇంటి ఎదురుగా ఆగి ఉన్న లారీని ఢీకొని ఇంట్లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఇంటి రేకుల షెడ్డు పూర్తిగా ధ్వంసమైందన్నారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తికి మూడేళ్లు జైలు

తుని రూరల్: హత్యాయత్నం కేసులో నేరం రుజువు కావడంతో పిఠాపురం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి కె.మాధవి ఒక వ్యక్తికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.రెండు వేలు జరిమానా విధించినట్టు రూరల్ ఎస్సై ఎ.బాలాజీ తెలిపారు. మంగళవారం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. 2020 ఆగస్టు 27న తుని మండలం వల్లూరు గ్రామానికి చెందిన కొత్తూరు వీర భాస్కరరావుపై అదే గ్రామస్తుడు కుర్ర చిన్న నాగేశ్వరరావు గొడ్డలితో తలపై కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. వీర భాస్కరరావు ఫిర్యాదుతో అప్పటి రూరల్ ఎస్సై వై.గణేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న జడ్జి తుది తీర్పు ఈరోజు ఇచ్చారన్నారు. కేసు పురోగతికి సహకరించిన రూరల్ సీఐ ఎ.సన్యాసిరావు, ఎస్సై ఎ.బాలాజీ, కోర్టు కానిస్టేబుల్‌లను ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు, అదనపు ఎస్పీ పి.శ్రీనివాస్, డీఎస్పీఎం.వెంకటేశ్వరరావులు అభినందించారు.

సంక్రాంతి సంబరాలు



ఏలేశ్వరంలో భోగిమంటలు వేస్తున్న దృశ్యం



ఏలేశ్వరంలో సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు



మండపంలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

ఏలేశ్వరం: సంక్రాంతి సంబరాలు మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక భాష్యం స్కూల్‌లో విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బాష్యం స్కూల్‌లో ప్రిన్సిపాల్ గొల్లపల్లి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో భోగిమంటలు వేశారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు సంప్రదాయ వేడుకలు జరిపారు. వేడుకల్లో గొబ్బిళ్లమ్మతో పాటు రంగురంగుల ముగ్గులు, హరిదాసు, గంగిరెద్దులు, తదితర సంప్రదాయ పద్ధతులు పాటించారు. కార్యక్రమంలో ప్రైమరీ ప్రిన్సిపాల్ ఉషారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శంఖవరం: మండపం సత్యభారతి స్కూల్లో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ క్యాంపస్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సందడి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆదిత్య అధినేత ఎన్ శేషారెడ్డి, వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి హాజరై మాట్లాడారు. కళాశాలల డైరెక్టర్స్ ఎస్.శృతిరెడ్డి, సుగుణా రెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం స్పోర్ట్స్, సంక్రాతి సంబరాలను వేడుకగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆ కళాశాల చైర్మన్ పరుచూరి కృష్ణారావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సంక్రాంతి సంబరాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ ఎంవీ హరనాథబాబు, ఎస్.శంభుప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, కళాశాల ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ జి.నరేష్, హెచ్ఓడీ కెఎల్ వివేకా, ఎల్.యమున పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: సంక్రాంతి పండగ ముందే వచ్చేసిందా అన్నట్టు ప్రత్తిపాడు అఖిల్ కళాశాలలో మంగళవారం సాయంత్రం సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. భోగి మంట వెలిగించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో అలరించారు. కరస్పాండెంట్ ఇనకోటి గంగాధర్, డైరెక్టర్ ఇనకోటి సునీత, ప్రిన్సిపాల్ బుజ్జి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోకవరం: స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద మంగళవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిన మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి సంతూర్ ఆధ్వర్యంలో ఎస్సై యూవీ శివ నాగబాబు బహుమతులు అందజేశారు. పాల్గొన్నవారందరికీ ప్రోత్సాహక బహుమతులు అందించారు.

తుని రూరల్: ఎస్.అన్నవరం శివారు జగన్నాథగిరిలో ఏపీ రెసిడెన్షియల్ స్కూల్లో ప్రిన్సిపాల్ ఎన్.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఎస్ఎంసీ చైర్మన టి.రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



ఏపీ రెసిడెన్షియల్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు



గోకవరంలో ముగ్గులు వేస్తున్న మహిళలు



హరిదాసుకు బియ్యం వేస్తున్న కళాశాల యాజమాన్యం

పాఠశాల పరిశీలన

గండేపల్లి: తాళ్లూరు హైస్కూల్‌ను పిఠాపురం డివిజన్ అధికారి డీవైఈఓ డి.సుభద్ర మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల ఉత్తీర్ణతను పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నాడు-నేడు పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆమె వెంట స్కూల్ హెచ్‌ఎం పి.నాగమణి, ఉపాధ్యాయులు మోహిని, జి.వెంకటేశ్వరరావు, ఎ.సత్యనారాయణ, మహేష్, పీఈటీ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.